


ఏయూ దూరవిద్య కోర్సుల్లో అడ్మిషన్లు ప్రారంభం

పాత శ్రీకాకుళం/ కలెక్టరేట్, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా యూనివర్సిటీ సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ ద్వారా 2025-26 విద్యా సంవత్సరానికి గాను డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. బీఏ, బీకాం, బీఎస్సీ వంటి డిగ్రీ కోర్సులతోపాటు ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీ వంటి పీజీ కోర్సుల్లో అర్హులైన విద్యార్థులు సెప్టెంబరు 15లోగా దరఖాస్తు చేసుకోవాలని శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల(పురుషులు) ప్రిన్సిపాల్, అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ డా.కె.శ్రీరాములు తెలిపారు. మరిన్ని వివరాలకు శ్రీకాకుళంలో ఏయూ డిస్టెన్స్‌ఎడ్యుకేషన్ అధ్యయన కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు.



గర్భిణులకు.. కోతలే



- జిల్లాలో తగ్గుతున్న సాధారణ ప్రసవాలు
- ప్రైవేటు ఆస్పత్రుల్లో 90 శాతం సిజేరియన్లు
- ప్రభుత్వ ఆస్పత్రులోనూ దాదాపు సగం మందికి ఆపరేషన్లు
- కానరాని అధికారుల పర్యవేక్షణ
- 'మిడ్‌వైవ్స్'తోనైనా మార్పు వచ్చేనా?

శ్రీకాకుళం, జూలై 27 (ఆంధ్రజ్యోతి):

ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు తగ్గుముఖం పడుతున్నాయి. నెలలు నిండిన గర్భిణులు ఆస్పత్రికి వెళ్తే చాలు.. సాధారణ ప్రసవం కోసం ఎదురుచూడకుండా ఆపరేషన్ చేసేయడమే. ప్రభుత్వ ఆస్పత్రుల్లో దాదాపు సగం ఇదే పరిస్థితి ఉండగా.. ప్రైవేటు ఆస్పత్రుల్లో మాత్రం ప్రసవం అంటేనే 'సిజేరియన్' తప్పనిసరి అన్నట్టు పద్ధతి మార్చేశారు. 'బిడ్డ అడ్డం తిరిగింది.. పరిస్థితి విషమించింది.. సిజేరియన్ చేయాల్సిందే' నంటూ వైద్యులు చెప్పడంతో చేసేదేమీ లేక గర్భిణుల కుటుంబ సభ్యులు ఆపరేషన్‌కు అంగీకరిస్తున్నారు. ఏడాదికోసారైనా పర్యవేక్షించేవారు లేకపోవడంతో ప్రైవేటు ఆస్పత్రుల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ, ఆపరేషన్ల పేరిట బిల్లుల రూపంలో రూ. వేలల్లో దోచుకుంటున్నారు.

● ఇదీ పరిస్థితి..

జిల్లాలో దశాబ్దం కిందట సాధారణ ప్రసవాలే జరిగాయి. తల్లీబిడ్డ ఆరోగ్యమే లక్ష్యంగా ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యమిచ్చేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ గర్భిణులకు ఆపరేషన్ల సంఖ్య పెరిగింది. వెయ్యి మంది గర్భిణుల్లో 495 సాధారణ ప్రసవాలు.. 505 సిజేరియన్లు ఉంటున్నాయి. ఇక ప్రైవేటు ఆస్పత్రుల్లో దాదాపు 90శాతం మందికి ఆపరేషన్లు చేస్తూ కోత కోసేస్తున్నారు.

2024-25 సంవత్సరంలో జిల్లావ్యాప్తంగా 28,846 ప్రసవాలు జరిగాయి. ఇందులో సాధరణ ప్రసవాలు.. 7,183 కాగా.. 21,663 మంది గర్భిణులకు సిజేరియన్ చేశారు. ఇక ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకు 6,288 ప్రసవాలు అయ్యాయి. ఇందులో సాధారణ ప్రసవాలు 1,535 మాత్రమే. మిగిలిన 4,753 సిజేరియన్ డెలివరీలే. ప్రైవేటు ఆస్పత్రుల్లో కొంతమంది గర్భిణుల కుటుంబ సభ్యులు కూడా ముహూర్తం చూసుకుని.. సి-సెక్షన్ (సిజేరియన్) చేయించేస్తున్నారు. ఈక్రమంలో ఆపరేషన్ల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది.

● 'మిడ్‌వైవ్స్' పేరిట శిక్షణ..

ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచేలా.. వైద్యసిబ్బంది, స్టాఫ్‌నర్సులకు ప్రభుత్వం 'మిడ్‌వైవ్స్' పేరిట శిక్షణ ఇవ్వనుంది. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా పలు ఆస్పత్రుల్లో స్టాఫ్‌నర్సులను ఎంపిక చేయనుంది. అతిత్వరలో మిడ్‌వైవ్స్ అందుబాటులోకి రానుంది. ఒక్కో 'మిడ్‌వైవ్' కోసం (మిగతా 8వ పేజీలో..)


జిల్లాలో 2024-25లో ప్రసవాలు ఇలా..

నెల	ప్రభుత్వ ఆస్పత్రుల్లో		ప్రైవేటు ఆస్పత్రుల్లో	
	సాధారణం	సిజేరియన్	సాధారణం	సిజేరియన్
ఏప్రిల్	319	365	133	1,048
మే	406	536	207	1,385
జూన్	465	490	215	1,361
జూలై	434	458	184	1,298
ఆగస్టు	419	463	200	1,400
సెప్టెంబరు	441	500	210	1,411
అక్టోబరు	439	548	230	1,560
నవంబరు	454	503	243	1,433
డిసెంబరు	388	504	237	1,449
జనవరి	357	461	232	1,413
ఫిబ్రవరి	294	390	173	1,172
మార్చి	301	387	202	1,128
మొత్తం	4,717	5,605	2,466	16,058

ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకు..

నెల	ప్రభుత్వ ఆస్పత్రుల్లో		ప్రైవేటు ఆస్పత్రుల్లో	
	సాధారణం	సిజేరియన్	సాధారణం	సిజేరియన్
ఏప్రిల్	304	335	170	1040
మే	344	434	212	1,317
జూన్	319	413	186	1,214
మొత్తం	967	1,182	568	3,571

హెపటైటిస్‌పై అప్రమత్తం



- వ్యాధి తీవ్రమైతే లివర్ మార్పిడియే శరణ్యం
- అవగాహన లేమితో అనారోగ్యం
- నేడు ప్రపంచ హెపటైటిస్ దినం

● నరసన్నపేటకు చెందిన ఒక వ్యక్తి మద్యం అతిగా తాగడంతో లివర్ దెబ్బతిని మూడు నెలల కిందట మృతిచెందాడు. ముందుగా హెపటైటిస్ (కాలేయం వాపు), పచ్చకామెర్లను గుర్తిస్తే.. ఈ ప్రమాదం తప్పిదేనని వైద్యులు తెలిపారు. హెపటైటిస్‌పై అప్రమత్తంగా ఉండాలని మృతుడి కుటుంబ సభ్యులకు సూచించారు.

నరసన్నపేట, జూలై 27(ఆంధ్రజ్యోతి):

జిల్లాలో హెపటైటిస్ (కాలేయం వాపు) బాధితుల సంఖ్య ఏటా పెరుగుతోంది. కొంతమంది మద్యం అతిగా తాగడం, మరికొందరు మరిగే నూనెను మళ్లీమళ్లీ వినియోగించి ఆహార పదార్థాలు తీసుకోవడంతో ఈ వ్యాధి బారిన పడుతున్నారు. శరీరంలో చేరే మద్యాన్ని విసర్జించే క్రమంలో కాలేయం ఎక్కువ శ్రమకు గురై.. దెబ్బతింటుంది. ఫలితంగా ఆల్కహాలిక్ సిర్రోసిస్ వ్యాధులు వస్తాయి. ఆల్కహాలిక్ ఫ్యాటీలివర్ డిసీజ్‌లో కాలేయం కణాల్లో కొవ్వు పేరుకుపోయి వాపు కనిపిస్తుంది. దీన్నే ఆల్కహాలిక్ హెపటైటిస్ అంటారు. ఈ వ్యాధితో కాలేయం పనితీరు క్రమంగా అదుపు తప్పుతుంది. అలాగే కలుషిత నీరు తాగడం, అపరిశుభ్రమైన వాతావరణం నడుమ జీవనం సాగించేవారు కూడా హెపటైటిస్ వ్యాధి లక్షణాలతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో హెపటైటిస్‌పై అప్రతమత్తంగా ఉండాలని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. వ్యాధి తీవ్రమైతే లివర్ మార్పిడే శరణ్యమని, ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించి చికిత్స అందజేస్తే ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చని చెబుతున్నారు. 'వ్యాధిగ్రస్థుడు ఏటా వైద్యపరీక్షలు చేసుకోవాలి. హెపటైటిస్ టీకా, వారానికి ఒక ఇంట్రఫిరాన్ ఇంజక్షన్ వేయించుకోవాలి. మాత్రల ద్వారా కూడా నియంత్రణ చేయవచ్చు' అని వైద్యులు స్పష్టం చేస్తున్నారు.

● **హెపటైటిస్-ఏ:** వికారం, వాంతులు, కామెర్లతో ఇది బయటపడుతోంది. ఇది దీర్ఘకాలిక వ్యాధికాదు. చాలామందిలో దానంతట అదే తగ్గిపోతుంది. రక్త పరీక్షల ఆధారంగా వ్యాధిని నయం చేయవచ్చు. ఈ వ్యాధి రాకుండా వ్యాక్సిన్ కూడా అందుబాటులో ఉంది.

● **హెపటైటిస్-బీ:** ఇది అత్యంత ప్రమాదకరమైనది. హెచ్ఐవీతో పోలిస్తే ఈ వ్యాధి 50 నుంచి 100 రెట్లు వేగంగా ఒక వ్యక్తి నుంచి మరో వ్యక్తికి వ్యాపిస్తుంది. వైరస్ శరీరంలోకి ప్రవేశించిన 30నుంచి 180రోజుల్లో లక్షణాలు బయటపడతాయి. ఈ వైరస్ దీర్ఘకాలంగా కాలేయంపై ప్రభావం చూపి కేన్సర్‌కు దారితీస్తుంది.

● **హెపటైటిస్-సీ:** ఇది ఇన్ఫెక్షన్‌కు దారితీస్తుంది. సరిగా స్టెరిలైజ్ చేయకుండా వాడే వైద్య పరికరాలతో, ఒకరికి వాడే ఇంజెక్షన్ సూదులను మరొకరికి (మిగతా 8వ పేజీలో..)

అశ్రద్ధ చేయొద్దు..



హెపటైటిస్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి. అశ్రద్ధ చేయకుండా వ్యాధిగ్రస్థుడు జీవితాంతం మందులు వాడాల్సిందే. ముందుగా హైపటైటిస్ టీకా వేయించుకుంటే వ్యాధి వచ్చే అవకాశం లేదు. వ్యాధి ముదిరితే కాలేయం మార్పిడి చేసుకోవాలి.

- కింజరాపు శ్రీనివాస రవిశంకర్, లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జన్, శ్రీకాకుళం

చాలా ప్రమాదకరమైనది..



హెపటైటిస్ వ్యాధులు ప్రమాదకరమైనవి. ఇందులో హెపటైటిస్ బీ, సీలు అత్యంత ప్రమాదరమైనవిగా గుర్తించాలి. అందుకే రక్తపరీక్షలు చేయించుకోవాలి. వ్యాధి నిర్ధారణ అయిన వెంటనే చికిత్స పొందాలి. లేదంటే ప్రాణాలకే ప్రమాదం.

-పొన్నాడ గణేష్, సూపరింటెండెంట్, సామాజిక ఆసుపత్రి, కోటబొమ్మాళి

వితంతువులకు కొత్త పింఛన్లు

ఆగస్టు 1 నుంచి

● మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



కాలువ వద్ద పూజ చేసి సాగునీటిని విడుదల చేస్తున్న మంత్రి అచ్చెన్న

సంతబొమ్మాళి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన వితంతువులకు ఆగస్టు 1 నుంచి కొత్త పింఛన్లు పంపిణీ చేయనుందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఆదివారం సంతబొమ్మాళి మండలం వడ్డివాడ వద్ద గరీబుల గెడ్డ కాలువకు పూజలు చేసి సాగునీటిని విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 'రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వం అర్హులైన 1.20 లక్షల మంది వితంతువుల పింఛన్లు నిలిపివేసింది. వాటిని పునరుద్ధరించాం. ఖరీఫ్‌లో సాగునీటికి ఇబ్బందులు లేకుండా కాలువల మరమ్మతులు చేపట్టాం. శివారు భూములకు సకాలంలో సాగునీరు అందేలా అధికారు లతో ప్రణాళికలు సిద్ధం చేశాం. ఎన్నికల హామీలన్నీ నేరవేర్చుతున్నాం. త్వరలోనే అన్నదాత సుఖీభవ నిధులు రైతుల ఖాతాలో జమవుతాయి. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఆగస్టు 15 నుంచి ప్రారంభం కానుంద'ని తెలిపారు. ఇదిలా ఉండగా గరీబుల గెడ్డ కాలువ గట్టును మరో 300 మీటర్లు పొడిగిస్తే.. కోటబొమ్మాళి రైల్వేస్టేషన్‌కు వేళ్లేందుకు 50 తీరప్రాంత గ్రామాలకు ఉపయోగంగా ఉంటుందని బోరుభద్ర గ్రామస్థులు మంత్రి అచ్చెన్న దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మంత్రి అచ్చెన్న స్పందిస్తూ.. ఈ రహదారికి అంచనాలు రూపొందించాలని పీఆర్‌డీఈ సుధాకర్‌ను ఆదేశించారు. అనంతరం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా వడ్డివాడ, జొన్నలపాడు గ్రామాల్లో మంత్రి అచ్చెన్న పర్యటించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కింజరాపు హరిప్రసాద్, ఎల్ఎల్ నాయుడు, జీరు భీమారావు, అట్టాడ రాంప్రసాద్, రెడ్డి అప్పన్న, సర్పంచ్ గూట్ల మల్లేషు, ఎంపీటీసీ మెండ సాయిరాం, అధికారులు పాల్గొన్నారు.

ఏపీపీఎస్సీ పరీక్షలకు 163 మంది హాజరు

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ డిపార్ట్‌మెంటల్ పరీక్షలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలు ఆగస్టు ఒకటో తేదీ వరకు జరగనున్నాయి. ఆదివారం చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వేంకటేశ్వరరావు పరిశీలించారు. పరీక్షల నిర్వహణ తీరు, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, పర్యవేక్షణ విధానాలపై సమీక్షించారు. జిల్లాలో తొలిరోజు నిర్వహించిన పరీక్షకు 190 మంది అభ్యర్థులకుగానూ 163మంది హాజరయ్యారని తెలిపారు. కార్యక్రమంలో ఏపీపీఎస్సీ అధికారులు భోగేశ్వరి, పద్మప్రియ, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ జోగారావు తదితరులు పాల్గొన్నారు.

పవన్ మాట.. అభివృద్ధి బాట

- నెరవేరనున్న డిప్యూటీ సీఎం హామీలు
- రావివలసలో రూ.15కోట్లతో శరవేగంగా పనులు

టెక్కలి రూరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ హామీలు నెరవేరనున్నాయి. ఎండలమల్లన్న కొలువైన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం.. రావివలస గ్రామంలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. మంత్రి అచ్చెన్నాయుడు కోరిక మేరకు ఈ ఏడాది మే 22న టెక్కలిలో 'మన ఊరి కోసం మాటామంతీ' అనే స్క్రీన్ గ్రీవెన్స్ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ శ్రీకారం చుట్టారు. టెక్కలి మండలం రావివలస గ్రామస్థులతో ముఖాముఖి నిర్వహించారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి.. తక్షణమే పరిష్కరించేలా ఆదేశాలు జారీచేశారు. అలాగే ప్రజల అభ్యర్థన మేరకు రావివలసలో వివిధ అభివృద్ధి పనులకు సుమారు రూ.15 కోట్లు మంజూరు చేయించారు. ఈ నిధులతో ప్రస్తుతం పనులు చేపడుతున్నారు. సీసీ రోడ్లు నిర్మిస్తున్నారు. ఎండల (మిగతా 7వ పేజీలో..)



ఎండలమల్లికార్జున స్వామి ఆలయం వద్ద సీసీ రోడ్డు పనులు

ఆ రైతులకు 'రైల్వే' కష్టాలు



కంచిలి- సోంపేట సరిహద్దులో రైల్వేట్రాక్‌కు ఇరువైపులా పాతిన స్తంభాలు

- పలాస-ఇచ్ఛాపురం మధ్య మూడోట్రాక్ పనులు
- ట్రాక్‌కు ఇరువైపులా స్తంభాలు పాతుతున్న వైనం
- అండర్ టన్నెల్, పాసేజ్‌ల మార్గాలు మూసివేత

ఇచ్ఛాపురం, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల రైతులకు రైల్వేపరంగా అపార నష్టం జరుగుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. పలాస- ఇచ్ఛాపురం మధ్య మూడో ట్రాక్ పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో పలాస నుంచి ఇచ్ఛాపురం వరకూ రైల్వేట్రాక్‌కు ఇరువైపులా స్తంభాలు ఏర్పాటు చేస్తున్నారు. చివరకు రైల్వే ఎల్‌సీ గేట్ల వద్ద కూడా విడిచిపెట్టడం లేదు. కల్వర్టులు, చిన్నపాటి వంతెనల వద్ద ఉన్న మార్గాలను స్తంభాలతో మూసివేస్తుండడంతో రెండు నియోజకవర్గాల రైతులు ఆందోళన చెందుతున్నారు. తమ గ్రామాల చెంతనే రైల్వేట్రాక్‌కు అడ్డంగా విద్యుత్ స్తంభాలు పాతుతుండడంతో అవతలి ప్రాంతానికి వెళ్లలేని పరిస్థితి నెలకొంటోందని వాపోతున్నారు. తమ సమస్యకు పరిష్కారం చూపాలని ఇటీవల ఇచ్ఛాపురం నియోజకవర్గం రైతులు ఈసుకోస్టు ఖుర్దా రైల్వే డివిజన్ పరిధిలో బరంపురం రైల్వేసెక్షన్ అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు.

● మూడో రైల్వేట్రాక్ ఇలా..

విశాఖ-భువనేశ్వర్ మధ్య మూడో రైల్వేట్రాక్ నిర్మాణానికి భారత రైల్వేశాఖ అనుమతిచ్చింది. ఇందుకు సంబంధించి డీపీఆర్ కూడా పూర్తయింది. విశాఖ నుంచి పలాస మధ్య కొత్తగా ఏర్పడిన దక్షిణ కోస్తా రైల్వేజోన్‌లో చేర్చారు. పలాస నుంచి ఇచ్ఛాపురం వరకూ 45 కిలోమీటర్ల పరిధిని ఈస్టుకోస్టు రైల్వేజోన్‌లోనే ఉంచారు. ఇటు విశాఖ, అటు పశ్చిమబెంగాల్, ఝార్ఖండ్, ఛత్తీసగడ్ నుంచి పారిశ్రామిక ఉత్పత్తులు, వనరుల దిగుమతి, ఎగుమతి దృష్ట్యా మూడో రైల్వేలైన్ ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. విశాఖ కేంద్రంగా ఏర్పాటైన దక్షిణ కోస్తా పరిధిలోని విశాఖ నుంచి పలాస రైల్వేస్టేషన్ (మిగతా 7వ పేజీలో..)

అధికార లాంఛనాలతో డీఎస్పీ అంత్యక్రియలు

● నివాళులర్పించిన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి 8లో



పర్యవేక్షణ లేక.. పరిశుభ్రతకు నోచుకోక

● ఇదీ వజ్రపుకొత్తూరులోని వజ్రాల చెరువులో పరిస్థితి



చెరువులో నీరు రంగుమారిన దృశ్యం

వజ్రపుకొత్తూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): వజ్రపుకొత్తూరులోని వజ్రాల చెరువు నిర్వహణపై పర్యవేక్షణ లేకపోవడంతో పరిశుభ్రతకు నోచుకోవడంలేదు. చెరువులో రోజుల తరబడి చెత్త పేరుకుపోవడం వల్ల దుర్వాసన వెలువడుతోంది. ఒకప్పుడు వజ్రపుకొత్తూరుతోపాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజల ఈ చెరువు నీటిని తాగు అవసరాలకు వినియోగించేవారు. రెండు మూడేళ్ల నుంచి పంచాయతీ అధికారులు చెరువు నిర్వహణపై దృష్టిసారించకపోవడంతోపాటు గ్రామంలో చెత్త ఇక్కడికే చేరుతోంది. దీంతో కుళ్లిపోవడంతో దుర్వాసన వస్తోందని పలువురు చెబుతున్నారు. ఈ చెరువు కింద సుమారు వంద ఎకరాల వరకూ ఆయకట్టు సాగవుతోంది. తక్షణమే చెరువులో చెత్త తొలగించి పరిశు భ్రతపై దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు.

కంకర వేసి.. క్రషర్ పోసి

● అర్ధాంతరంగా నిలిచిపోయిన పనులు ● ఇదీ బొడ్డపాడు రహదారి దుస్థితి



పలాసరూరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి):పలాస జాతీయరహదారి నుంచి బొడ్డపాడు వెళ్లే మూడు కిలోమీటర్ల రహదారి పనులు అర్ధాంతరంగా నిలిచి పోయాయి. రెండునెలల కిందట ఉపాధిహామీ పథకం ద్వారా ఈ పనులు చేప ట్టారు. కేవలం ఆ రోడ్డులో కంకర, క్రషర్ వేసి పనులు నిలిపివేశారు. బొడ్డపాడు నుంచి జాతీయరహదారికి చేరుకునేందుకు అనువైన మార్గం, త్వరగా చేరు కునేందుకు వీలుఉండడంతో నిత్యం రద్దీగా ఉంటోంది. ఇంత ప్రాధాన్యం గల రహదారి పనులు నిలిచిపోవడంతో బొడ్డపాడుతోపాటు చుట్టు పక్కల గ్రామస్థులు అవస్థలకు గురవుతున్నారు.సకాలంలో రోడ్డును పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాల్సిఉన్నా, అధికారులు దృష్టిసారించకపోవడంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

బొడ్డపాడు రహదారిలో చిప్స్, క్రషర్ వేసి విడిచిపెట్టిన దృశ్యం

పవన్ మాట.. అభివృద్ధి బాట

(ఐదో పేజీ తరువాయి)

మల్లన్న ఆలయ అభివృద్ధితోపాటు పంచాయతీలో తాగునీటి సమస్య పరిష్కరించనున్నారు. రహదారులు, కాలువల వ్యవస్థ మెరుగుపరచనున్నారు. పెద్ద చెరువు అభివృద్ధి, దోబీఘాట్ నిర్మాణాలు చేపట్టనున్నారు. వైసీపీ పాలనలో ఆలయాలను అభివృద్ధి చేయకుండా వదిలేశారు. దేవదాయశాఖ నిధులు సైతం దారి మళ్లించారు. ఈ క్రమంలో రావివలసలోని ఎండలమల్లన్న ఆలయంలో కూడా కనీస సౌకర్యాలు లేక భక్తులు ఇబ్బందులు పడ్డారు. డిప్యూటీ సీఎం ఇచ్చిన హామీ మేరకు ఎండలమల్లన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తుండడంతో ఈ ప్రాంతవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రావివలసకు మంచిరోజులు వచ్చాయని గ్రామస్థులు సంబరపడుతున్నారు.

ఆ రైతులకు 'రైల్వే' కష్టాలు

(ఐదో పేజీ తరువాయి)

మధ్య పర్వాలేదు. ఇప్పటికే దాదాపు 150కిలోమీటర్ల పరిధిలోని రైల్వేఅండర్ క్రాసింగ్, వంతెనలు ఉన్నచోట అండర్ పాసేజ్‌లు నిర్మించారు. ఎచ్చెర్ల, ఆమదాలవలస, టెక్కలి, పలాస నియోజకవర్గంలోని కొంత భాగంలో అండర్ పాసేజ్‌లు, అండర్ టన్నెల్ నిర్మాణాలు ఎప్పుడో జరిగిపోయాయి. అక్కడ రైల్వేట్రాక్‌కు ఇరువైపులా ఉండే పొలాల నుంచి వ్యవసాయ ఉత్పత్తులు తరలించే వీలుగా ఏర్పాట్లు చేశారు. జిల్లా సరిహద్దు నుంచి ఉన్న జి.సిగడాం, పొందూరు, శ్రీకాకుళం రోడ్డు (ఆమదాలవలస), ఉర్లాం, తిలారు, హరిశ్చంద్రపురం, కోటబొమ్మాళి, నౌపడ, పూండి, పలాస రోడ్ల పరిధిలో అండర్ టన్నెల్, పాసేజ్‌ల నిర్మాణం పూర్తయింది.

స్తంభాలతో క్లోజ్..

ప్రస్తుతం పలాస రైల్వేస్టేషన్ నుంచి ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ మధ్య 45 కిలోమీటర్ల పరిధిలో రైల్వేట్రాక్‌కు ఇరువైపులా స్తంభాలను పాతుతున్నారు. కల్వర్టులు,వంతెనలు ఉన్నచోట సైతంస్తంభాలు పాతుతుండడంతో రైల్వేట్రాక్ అవతలి వైపు భూములు ఉన్న రైతులు ఆందోళన చెందుతున్నారు. పలాస నుంచి జి.సిగడాం రైల్వేస్టేషన్ల మధ్య అండర్ టన్నెల్, పాసేజ్‌ల మాదిరిగా ఇక్కడ కూడా నిర్మాణాలు చేపట్టాలని పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల ప్రజలు కోరుతున్నారు. దీనిపై ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఎన్నిసార్లు వినతులు అందజేసినా ఫలితం లేకపోతోందని వాపోతున్నారు. ఇప్పటికైనా ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు, ఇచ్ఛాపురం, పలాస ఎమ్మెల్యేలు డాక్టర్ బెందాళం అశోక్, గౌతు శిరీష ప్రత్యేక చొరవ చూపించాలని కోరుతున్నారు. లేదంటే తమతో పాటు భూములపై హక్కుల పొందే భవిష్యత్ తరాలకు రవాణా కష్టాలు తప్పవని భావిస్తున్నారు.

కేంద్రం దృష్టికి సమస్య..

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో సోంపేట, కంచిలి, ఇచ్ఛాపురం మండలాల్లో రైల్వేట్రాక్ ఉంది. ప్రస్తుతం ట్రాక్‌కు ఇరువైపులా స్తంభాలు పాతుతున్నారు. దీంతో ట్రాక్ అవతలవైపు ఉన్న రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యను కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుతోపాటు ఉన్నతాధికారులకు నివేదించాం.సమస్యకు పరిష్కారమార్గం దొరుకుతుందనే ఆశాభావంతో ఉన్నాం.

- డాక్టర్ బెందాళం అశోక్, ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం

సాగుపైనే ఆధారం

దశాబ్దాలుగా సాగుపై ఆధారపడి బతుకుతున్నాం. రైల్వేట్రాక్‌ను దాటుకొని వ్యవసాయ పనులు చేస్తున్నాం. రైల్వే వంతెనల కింద నుంచి వ్యవసాయ ఉత్పత్తులు తీసుకుంటూ వస్తున్నాం. కానీ ఇప్పుడు ట్రాక్‌కు ఇరువైపులా స్తంభాలు పాతుతుండడంతో ఇబ్బందులు పడుతున్నాం.

- కె.జగన్నాయకులు, రైతు, సోంపేట మండలం

లయన్స్ క్లబ్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం



పైడి సింధూరను అభినందిస్తున్న వక్తలు

శ్రీకాకుళం కల్చరల్, జూలై27 (ఆంధ్రజ్యోతి):శ్రీకాకుళం సెంట్రల్ లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ప్రకటించారు. స్థానిక ఓ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ లైన్స్ క్లబ్ గవర్నర్ డీఎస్ఎస్‌వీ వర్మ కొత్త కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షురాలిగా పైడి సింధూర, సెక్రటరీగా టెక్కం రాంగోపాల్, ట్రెజరర్‌గా బరాటం కృష్ణ చైతన్య బాధ్యతలు స్వీకరించారు.ఉపాధ్యక్షులుగా బి.ఉమామహేశ్వరరావు, శివతేజ, కోఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ విష్ణుమూర్తి,ఎడ్యుకేషనల్ డైరెక్టర్‌గా బాడాన దేవ భూషన్, మెడికల్‌డైరెక్టర్‌గా బగాది జగన్నాథరావు,అడ్మిన్‌స్టేట్‌గా పి.సింహాచలం, డైరెక్టర్‌గా బరాటం మాధురిలను ఎంపికచేశారు. ఈ సందర్భంగా రిటైర్డ్ డీజీపీ జె.పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ఇంటర్నేషనల్ లయన్స్‌క్లబ్ ప్రపంచంలోనే అత్యున్నత సేవా సంస్థగా నిలుస్తోందని కొనియాడారు.

● శ్రీకాకుళం రూరల్, జూలై27 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ హర్షవల్లి సేవలు విస్తృతంకావాలని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. ఆదివారం శ్రీకాకుళం లయన్స్ క్లబ్ హర్షవల్లి కార్యవర్గ ప్రమాణస్వీకారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీమంత్రి ధర్మాన ప్రసాదరావు, లయన్స్ క్లబ్ హర్షవల్లి అధ్యక్ష బృందం, సభ్యులు పాల్గొన్నారు.

శ్రీకాకుళంలో జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, జూలై27(ఆంధ్రజ్యోతి):శ్రీకాకుళంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల మైదానంలో బాలబాలికల జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు ఆదివారం నిర్వహించారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-14, 16, 18, 20 బాలబాలికలకు వేర్వేరు ఈవెంట్లు ఏర్పాటుచేశారు.ఈ సందర్భంగా క్రీడాకారులకు 60 మీటర్ల రన్ నుంచి 10వేల మీటర్ల పరుగు వరకు, లాంగ్‌జంప్, హైజంప్, షాట్ పుట్, హేమర్‌త్రో, జావిలిన్‌త్రో, గ్రూప్ ఈవింట్లతోపాటు పలు విభాగాల్లో ఎంపికలను నిర్వహించారు. జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షుడు కె.మధుసూదనరావు, కార్యదర్శి ఎం.సాంబమూర్తి పర్యవేక్షణలో జరిగిన ఎంపికలకు ఆర్గజింగ్ కార్యదర్శి కె.మాధవరావు, పీఈటీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీ రమణ, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బీవీ రమణ, వై.పోలినాయుడు, కె.హరిబాబు కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చదరంగం పోటీలు

శ్రీకాకుళంలోని సీఎస్ఎన్ ట్రస్ట్ కార్యాలయంలో జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-13 బాలబాలికల జిల్లాస్థాయి చదరంగంపోటీలు ఆదివారం నిర్వ హించారు.నాలుగు రౌండ్లకు గాను నాలుగు పాయింట్లు సాధించిన బగది కార్తికేయ, డొంకాడ కార్తికేయ, మొదటి స్థానాల్లో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బాలికల విభాగంలో బొల్లా శృతి, ప్రాహ్యలు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. వీరంతా ఆగస్టు రెండో తేదీ నుంచి విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి చదరంగం పోటీల్లో జిల్లా తరఫున పాల్గొంటారని టోర్నమెంట్ డైరక్టర్ సనపల భీమారావు తెలిపారు.గెలుపొందిన క్రీడాకారులకు ట్రస్టు సభ్యులు వీరాంజనేయులు, చెస్‌సంఘం అధ్యక్షులు బగాది కిశోర్ బహుమతులు అందజేశారు.

కూటమితోనే ఉత్తరాంధ్ర నాయకులకు గుర్తింపు

● ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్



మాట్లాడుతున్న బెందాళం అశోక్

కవిటి, జూలై27(ఆంధ్రజ్యోతి):ఉత్తరాంధ్రలోని నాయకులకు దేశ స్థాయిలో గుర్తింపు కల్పించడం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ తెలిపారు. వైసీపీ హయాంలో ఉత్తరాంధ్రను వినాశనానికి పూనుకున్నారని ఆరోపించారు. ఆదివారం రామయ్యపుట్టుగలో విలేకరులతో మాట్లాడుతూ ఉత్తరాంధ్ర భూములు కొల్లగొట్టి లబ్ధిపొందాలని వైసీపీ యత్నించిందన్నారు. సాధారణ కార్యకర్తను పార్లమెంట్ సభ్యుడిగా అప్పలనాయుడును పంపించారన్నారు. విశాఖ కేంద్రంగా ప్రఖ్యాత కంపెనీలు వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

టీడీపీలోనే కార్యకర్తలకు గౌరవం

కార్యకర్తలను గౌరవించడం కేవలం టీడీపీకే సాధ్యమని ఎమ్మెల్యే అశోక్ తెలిపారు. ఆదివారం ఎర్రగోవిందపుట్టుగలో కవిటి పీఏసీఎస్ ఛైర్మన్‌గా ఎర్ర బాసుదేవ్ ప్రధాన్ ప్రమాణ స్వీకారం చేశారు.ఈ సందర్భంగా సామంత కుల సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనతోనే అభివృద్ధి సాధ్యమన్నారు.సంక్షేమాన్ని అమలు చేస్తున్నా వైసీపీ నాయకులు లేనిపోని విమర్శలు చేస్తున్నారన్నారు. సామంత కులస్థులు అభ్యున్నతికి పాటుపడతానని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు, ఏఎంసీ ఛైర్మన్ మణిచంద్రప్రకాష్, నేతలు బి.రమేష్, మధు, రంగారౌళో, ఎస్‌వీ రమణ పాల్గొన్నారు.

పరిశ్రమలను తరిమేసిన జగన్ ముఠా

ఇచ్ఛాపురం, జూలై 27(ఆంధ్రజ్యోతి):ఉత్తరాంధ్రను అభివృద్ధి చేయడంతో పాటు ఇక్కడి నాయకులకు పదవులు అప్పగించి అత్యున్నతగౌరవాన్ని కల్పించిన చంద్రబాబునాయుడుకు పజలు రుణపడి ఉంటారని టీడీపీరాష్ట్ర కార్యదర్శి సాలిన ఢిల్లీ యాదవ్ ఒకప్రకటనలో తెలిపారు.ఉత్తరాంధ్ర నుంచి అశోక్ గజపతిరాజును గోవా గవర్నర్‌గా నియమించడం,కింజరాపు రామ్మోహన్ నాయుడును కేంద్ర విమానాయాన మంత్రిని చేయడం, సాధారణ కుటుంబం నుంచి వచ్చిన కలిసెట్టి అప్పలనాయుడును ఎంపీగా చేయడం టీడీపీకే సాధ్యమయ్యిందని పేర్కొన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన పరిశ్రమలను కూడా ఉత్తరాంధ్ర నుంచి జగన్‌రెడ్డి అండ్ ముఠా తరిమేసిందని తెలిపారు.

వైసీపీ హయాంలో రాష్ట్రం నాశనం: కళా



మాట్లాడుతున్న కళా వెంకటరావు

అరసవల్లి,జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రాన్ని పూర్తిగా నాశనం చేశారని, మాజీ సీఎం జగన్‌రెడ్డి, మాజీ మంత్రి బొత్సలు అభివృద్ధి విధ్వంసకారులని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు ఆరోపించారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తోందని తెలిపారు. ఆదివారం అరసవల్లిలోని సూర్యనారాయణ స్వామిని సతీసమేతంగా దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల విలేకరులతో మాట్లాడుతూ ఏడాది పాలనలో రాష్ట్రానికి రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. అన్ని విధాలా అన్యాయమైపోయిన రాష్ట్రాన్ని మళ్లీ చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమం దిశగా విజయవంతంగా నడిపిస్తున్నారన్నారు. ప్రజలు సంతోషంగా ఉన్నారని, ఇది చూసి ఓర్వలేక వారు ఏవేవో మాట్లాడుతున్నారన్నారు. ఉత్తరాంధ్రను ఎప్పుడూ టీడీపీ ప్రత్యేక దృష్టితోనే చూస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, ఎస్సీ రమణ మాదిగ, జల్లు రాజీవ్ పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ హామీలు బూటకం

ఇచ్ఛాపురం, జూలై 27(ఆంధ్రజ్యోతి): సూపర్‌సిక్స్ హామీలు బూటకమని జడ్పీ చైర్‌పర్సన్ పిరియావిజయ ఆరోపించారు.ఆదివారం బాలకృష్ణాపురంలో బాబుష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో ఎంపీపీ పుష్ప, జడ్పీటీసీ నారాయణమ్మ, రాజశేఖర్‌రెడ్డి, నర్తుప్రేం, మోహన్‌దాస్ పాల్గొన్నారు

రాజారావుకు ఆర్ట్ ఫౌండేషన్ అవార్డు

ఆమదాలవలస, జూలై 27 (ఆంధ్రజ్యోతి):పట్టణానికి చెందిన కవి, రచయిత కుప్పిలి వెంకట రాజారావుకు ఆర్ట్ ఫౌండేషన్ ఆదివారం విజయవాడలో నిర్వహించిన అమరావతి సాంస్కృతిక ఉత్సవంలో రాష్ట్రస్థాయి గుర్తింపు లభించింది. ఆయన రచించిన నవ్యాంధ్ర పసిడి కల అన్న కవితను కవి సమ్మేళనం వేదికపై పఠించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు కళారత్న పొట్లూరి హరికృష్ణ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

అక్రమ డీపట్టాను రద్దు చేయాలి

ఆమదాలవలస, జూలై 27 (ఆంధ్రజ్యోతి): చిట్టివలస పంచాయతీకి చెందిన శీర పోలమ్మపేరుతో మంజూరుచేసిన అక్రమడీపట్టాను రద్దుచేయాలని ఆ గ్రామానికి చెందిన యువకులు డిమాండ్‌చేశారు.ఆదివారం గాజుల కొల్లివలసలో లేఅవుట్‌కు ఎదురుగా ఉన్న శీర పోలమ్మకు చెందిన డిపట్టా భూమి వద్ద రెవెన్యూ అధికారులు మంజూరు చేసిన అక్రమ డీ పట్టాను రద్దు చేయాలని నిరసన తెలిపారు.

నేడు పీజీఆర్ఎస్

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల నమోదు పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమం సోమవారం జరగనుందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో కోరారు. అర్జీదారులు వారి అర్జీలను మీకోసం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

కొఠారిలో శ్రమదానం

ఇచ్ఛాపురం, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొఠారిలో ఆదివారం శ్రమదానం నిర్వహించారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలు పెరగడంతో వాహనచోదకులు ఇబ్బందిపడుతున్నారు. దీంతో గ్రామస్థులు ఆనంద్ ఆధ్వర్యంలో పిచ్చిమొక్కలు తొలగించడంతోపాటు పారిశుధ్యపనులు నిర్వహించారు.

చింతాడలో వైద్యశిబిరం

ఆమదాలవలస, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని ఏడో వార్డు చింతాడలో మెట్టక్కివలస సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కన్వీనర్ స్నేపల్లి వెంకట కామావధానులు ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో వంద మందికి వైద్య పరీక్షలు చేశారు.సత్యసాయిప్రతినిధి డాక్టర్ తాతయ్యలు పర్యవేక్షణలో ఎముకల, చిన్నపిల్లల, దంత వైద్య నిపుణులు హేమంత్, రమేష్, ఎం.పద్మ పరీక్షలు నిర్వహించి 70 మంది ఎముకలు వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కూన ప్రమీల, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి బోర గోవిందరావు, ఎం.రవీం ద్రబాబు పాల్గొన్నారు.

●శ్రీకాకుళం రూరల్, జూలై27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిల్లిపాలెంలో సత్య సాయి బాబా శతజయంతుత్యవాలు పురస్కరించుకుని బ్యాంకర్‌కాలనీ సత్య సాయి బాబాసేవసమితి ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొండు శంకర్ మందులను పంపిణీ చేశారు.

సైకత శిల్పిపై దాడి తగదు

ఆమదాలవలస, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజులకొల్లివలస వద్ద ఉన్న సంగమేశ్వర కొండ ప్రాంతంలో సైకత శిల్పి గేదెల హరికృష్ణపై దాడిచేయడం తగదని ఆమ్‌ఆద్మీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డేపల్లి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల కొందరు మద్యం,గంజాయి సేవించి హరికృష్ణపై భౌతిక దాడికి పాల్పడం దురదృష్టమని పేర్కొన్నారు.దాడిచేసిన వారికి శిక్షించాలని, సంగమేశ్వరస్వామి కొండ పరిసరాల్లో పోలీస్ నిఘా ఉంచాలని కోరారు.

వేతనం 15 వేలు చెల్లించాలి

పొందూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు కనీసవేతనంతో చెల్లించడంతోపాటు, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని ఏపీ పాఠశాలల, కళాశాలల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు అల్లు మహాలక్ష్మి డిమాండ్‌చేశారు. పొందూరులో ఏర్పాటు చేసినసమావేశంలో మాట్లాడుతూ స్కూల్ శానిటేషన్‌వర్కర్లకు కనీసవేతనం 15 వేలుఇవ్వాలని డిమాండ్‌చేశారు. కాగా ఎస్.పద్మ, పార్వతిలను సంఘం అధ్యక్ష, ప్రధానకార్యదర్శులుగా ఎన్నుకున్నారు.

చంద్రబాబుతోనే అన్ని వర్గాల అభివృద్ధి

● జిల్లావ్యాప్తంగా 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం

రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలనలో అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకులు తెలిపారు. ఆదివారం జిల్లాలోని పలుచోట్ల తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కరపత్రాలు అందజేసి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.

●అరసవల్లి,జూలై27(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని ఇతర రాష్ట్రాల నేతలు చూస్తున్నారని, దేశం మెచ్చుకునేలా చంద్రబాబు పాలన ఉందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. శ్రీకాకుళంలోని గూనపాలెంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్ పాల్గొన్నారు.

● సరుబుజ్జిలి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొట్టవలస, షలంత్రి పంచాయతీ బురిడివలస గ్రామాల్లో నియోజకవర్గ తెలుగు యువత కార్యదర్శి తాడేల రాజారావు ఆధ్వర్యంలో నిర్వహించిన సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్య క్రమంలో డీసీసీబీ ఛైర్మన్ శివ్వాల సూర్యనారాయణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు తాడేల వెంకటరమణ, నాయకులు బెవర రాజారావు, మూడడ్ల రామకృష్ణ, పాల్గొన్నారు. అలాగే మెట్టక్కివలసలో టీడీపీ నాయకులు మొదలవలస రమేష్ నాగళ్ల మురళీధర్‌యాదవ్ ఆధ్వర్యంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు.

● జి.సిగడాం, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంట, ఆనందపురం, ఆబోతులపేట, దవళపేట, డీఆర్‌వలస తదితర గ్రామాలలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కుమరాపు రవికుమార్, క్లస్టర్, యూనిట్, బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.



అరసవల్లి: మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

● రణస్థలం, జూలై 27(ఆంధ్రజ్యోతి) :రణస్థలంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పిన్నింటి భానోజినాయుడు, మజ్జి పండోడు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరిపై పోలీసుల నిఘా: సీఐ

శ్రీకాకుళం క్రైం, జూలై 27 (ఆంధ్రజ్యోతి):ప్రతి ఒక్కరిపై పోలీస్ వారి నిఘా ఏర్పాటు చేస్తామని టూటౌన్ సీఐ ఈశ్వరరావు తెలిపారు. ఆదివారం శ్రీకాకుళంలోని రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

● గార రూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరి ప్రవర్తనలో మార్పు రావాలని గార ఎస్ఐ గంగరాజు కోరారు. గార పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీ షీటు జాబితాలో ఉన్న వారితో సమావేశం నిర్వహించారు.

●గార, జూలై 27 (ఆంధ్రజ్యోతి):మోటార్ వాహనాల చట్టం ప్రకారం నిబంధనలు పాటించాలని ఎస్ఐ గంగరాజు సూచించారు స్థానిక పోలీ స్‌స్టేషన్ వద్ద ఆటోడ్రైవర్లకు మోటార్ వాహన చట్టంపై అవగాహన కల్పించారు.

మురపాక మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలి

లావేరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి):మురపాక మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని మురపాక, కేశవరాయునిపాలెం, చిన్నయ్యపేట, తమాడ, పెదరావుపల్లి, చినమురపాక,లోపెంటతోపాటు ఎచ్చెర్ల, లావేరు, రణస్థలం మండలాల్లోని మరో 15 పంచాయతీలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు కోరారు.ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావును ఆదివారం టీడీపీ మండలాధ్యక్షుడు ముప్పిడి సురేష్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఆర్.ప్రకాశరావు, కలిశెట్టి భాస్కరావు, గొర్లె శ్రీనివాసరావు, కొన్ని హేమసుందరరావు వినతిపత్రం అందజేశారు.

వెలమ సంఘం కార్యవర్గం ఏర్పాటు

కంచిలి, జూలై 27(ఆంధ్రజ్యోతి): జిల్లా వెలమ కుల సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం కంచిలిలో ఎన్నికను నిర్వహించారు. సంఘ జిల్లా అధ్యక్షుడిగా ఇప్పిలి కృష్ణారావు, ఉపాధ్యక్షులుగా రావాడ సుదర్శనరావు, బొద్దుల వల్లభరావు, ట్రెజరర్‌గా గురుబిడ్డి మన్మథరావు, సెక్రటరీగా కప్పల యుగందర్ ఎన్నికయ్యారు.

లొద్దపుట్టి జంక్షన్‌లో తులసమ్మ సంబరాలు

ఇచ్ఛాపురం, జూలై 27(ఆంధ్రజ్యోతి):లొద్దపుట్టి జంక్షన్‌లో ధనరాజ తులసమ్మతల్లి సంబరాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి మహిళలు అమ్మవారి ఘటాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద భక్తులు బారులు తీరారు. అమ్మవారికి బిందెలతో తీసుకొచ్చిన పసుపునీళ్లు, పానాకాలతో అభిషేకాలు నిర్వహించారు.

స్మార్ట్‌మీటర్ల ప్రతిపాదన రద్దుచేయాలి

అరసవల్లి, జూలై 27(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.తులసీదాసు డిమాండ్‌చేశారు. ఆదివారం శ్రీకాకుళంలో సీపీఎం విస్తృత స్థాయి సమావేశం జరిగింది.కార్యక్రమంలో బి.కృష్ణమూర్తి, కె.మోహన రావు, జిల్లాకార్యదర్శి డి.గోవిందరావు, పి.తేజేశ్వరరావు, అమ్మన్నాయుడు పాల్గొన్నారు.

ఆదిత్యుని ఆలయానికి పోటెత్తిన భక్తులు

● స్వామి వారిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు

అరసవల్లి, జూలై 27(ఆంధ్రజ్యోతి): అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా స్వామివారికి రూ.4,83,604ల ఆదాయం లభించింది.ఇందులో టిక్కెట్ల ద్వారా రూ.2,22,100లు, విరాళాల ద్వారా రూ.82,424లు, ప్రసాదాల రూపంలో రూ.1,79,080లు లభించాయి.కాగా ఆదిత్యుని కోల్‌కతా డెట్ రికవరీ అప్పిలేట్ ట్రిబ్యునల్ చైర్మన్, మాజీ న్యాయాధికారి అనిల్ కుమార్ శ్రీవాస్తవ, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు సతీసమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధానార్చకులు స్వాగతం పలుకగా, అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామి వారి జ్ఞాపికను ఈవో వారికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, ఆలయ అర్చకులు ఇప్పిలి రంజిత్ శర్మ, నేతింటి.హరిబాబు, సాందీపశర్మ పాల్గొన్నారు.



డీఆర్‌ఏటీ చైర్మన్‌కు చిత్రపటాన్ని అందజేస్తున్న సిబ్బంది


అధికార లాంఛనాలతో డీఎస్పీ అంత్యక్రియలు

● నివాళులర్పించిన కలెక్టర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి


నివాళులర్పిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

పోలాకి, జూలై 27(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో శనివారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఇంటెలిజెన్స్ డీఎస్పీ, సీఎం స్పెషల్ సెక్యూరిటీ అధికారి (ఎస్ఎస్‌జీ) జల్లు శాంతారావు అంత్యక్రియలు ఆదివారం ఆయన స్వగ్రామం డోల గ్రామంలో అధికార లాంఛనాలతో జరిగాయి. అభిమానులు, కుటుంబసభ్యుల, ప్రజాప్రతినిధులు, పరిసర గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చి ఆయన పాడి వెంట కదిలి వీడ్కోలు పలికారు. శాంతారావు పెద్ద కుమారుడు బాలగంగాధర్ తిలక్ తండ్రికి తలకొరివిపెట్టారు. వారంరోజుల కిందటే గ్రామానికి వచ్చి సరదాగా మాట్లాడిన శాంతారావు.. ఇలా అకాల మరణం పొందడాన్ని అతడి స్నేహితులు జీర్ణించుకోలేకపోతున్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, నరసన్నపేట సీఐ ఎం.శ్రీనివాసరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ డోల జగన్ శాంతారావు మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు భైరి భాస్కరరావు ఇంటికి వెళ్లి మృతుడు భార్య జల్లు లక్ష్మీ, పెద్దకుమారుడు తిలక్‌ను భార్యను మృతుడు సమీప బంధువు జే.శివను ఓదార్చి అధైర్యపడవద్దని ధైర్యంచెప్పారు. అంత్యక్రియలో పోలాకి ఎస్ఐ రంజిత్, సమీప ఏ.ఎస్.పీలు, డీఎస్పీలు, కుటుంబసభ్యులు, అభిమానులు, గ్రామస్థులు, అధికారులు, సమీప గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొని నివాళులర్పించారు.

నువ్వలరేవు తీరంలో వ్యక్తి మృతి


ధనరాజ్ మృతదేహం

వజ్రపుకొత్తూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): నువ్వలరేవు సముద్ర తీరంలో అక్కుపల్లికి చెందిన మద్దు ధనరాజ్ (40) మృతి చెందినట్టు ఎస్ఐ నిహాల్ ఆదివారం తెలిపారు. ఇతడి మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

విద్యుత్ తీగలు చోరీ

పోలాకి, జూలై 27(ఆంధ్రజ్యోతి): గొల్లలవలస గ్రామ పరిసర పొలాల్లోని బోరుబావులకు అమర్చిన విద్యుత్‌తీగలను చోరీకి గురైనట్టు బాధిత రైతులు పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. 15 బోరుబావులకు విద్యుత్ సరఫరా అయ్యే తీగలను గుర్తుతెలియనివారు అపహరించారని, దీంతో రైతులు సాగునీటికి ఇబ్బందిపడుతున్నారు. ఘటనా స్థలానికి పోలీసులు వెళ్లి వివరాలు సేకరించారు. విచారణ జరిపి కేసు నమోదుచేస్తామని పోలీసులు తెలిపారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

● ఇద్దరి వ్యక్తులకు.. 16 పశువులకు గాయాలు


ఆవుకు చికిత్స అందిస్తున్న పశువైద్యుడు కిరణ్‌కుమార్

కోటబొమ్మాళి, జూలై 27(ఆంధ్రజ్యోతి): జర్జంగి పంచాయతీ గుంజిలోవ గ్రామంలో ఆదివారం వేకువజామున పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. దీంతో ఇద్దరు వ్యక్తులతోపాటు తొమ్మిది ఆవులకు, నాలుగు ఎద్దులు, మూడు దూడలు గాయపడ్డాయి. ఇంటిముందు కట్టిన ఈ పశువులతోపాటు ఆరుబయట నిద్రిస్తున్న తర్లింగి బారికప్పయ్య, తిర్లింగి మోహనరావులపై పిచ్చికుక్క దాడి చేసింది గాయపడిన వీరిద్దరూ స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నారు. అలాగే గాయపడిన పశువులకు పశువైద్యాధికారి లఖినేని కిరణ్‌కుమార్ వైద్యం అందించారు.

13 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

కొత్తూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): నీలకంఠాపురం సమీపంలో ఉన్న కొండల్లో పేకాట అడుతున్న వేర్వేరు శిబిరాలపై ఆదివారం రాత్రి కొత్తూరు పోలీసులు, శ్రీకాకుళం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసినట్టు ఎస్ఐ ఎండీ అమీర్ ఆలీ తెలిపారు. ఈ దాడిలో 13 మందిని అరెస్టు చేసినట్టు స్పష్టం చేశారు. వీరి నుంచి రూ.1.53 లక్షలు, కారు, మూడు బైక్‌లు, ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. పట్టుబడినవారంతా హిరమండలం, కొత్తూరు మండలాలకు చెందిన వారిగా గుర్తించామన్నారు. సోమవారం వారిని కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

షిర్డీసాయి ఆలయంలో చోరీ

శ్రీకాకుళం రూరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): పెద్దగనగళ్లవానిపేట పంచాయతీ పరిధి గాంధీనగర్ కాలనీలో గల షిర్డీసాయి ఆలయంలో చోరీ జరిగింది. రూరల్ ఎస్ఐ కె.రాము కథనం మేరకు.. గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి ఆలయంలోకి ప్రవేశించి హుండీని పగలుగొట్టి, అందులో ఉన్న నగదు, బీరువా తెరచి అందులో ఉన్న వెండి సామగ్రి అపహరించుకుపోయారు. వీటి విలువ రూ.43,500 ఉండొచ్చని అంచనా వేశారు. చోరీని గుర్తించి శనివారం ఆలయ కమిటీ సభ్యుడు చింతపల్లి గోపాలకృష్ణ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ కె.రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గర్భిణులకు.. కోతలే

(ఐదో పేజీ తరువాయి)

సుమారు రూ.2.50 లక్షలు ప్రభుత్వం ఖర్చు చేయనుంది. ఈ విధానంతోనైనా జిల్లా లో ఆపరేషన్ల సంఖ్య తగ్గి.. సాధారణ ప్రసవాలు పెరుగుతాయోమో.. వేచిచూడాలి.

● **కానరాని తనిఖీలు..**

జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులు.. ప్రైవేటు ఆస్పత్రులను తనిఖీచేసి.. గర్భిణులకు నిజంగా సిజేరియన్ అవసరమా.. అన్నది స్వయంగా పరీక్షిస్తే వాస్తవాలు వెల్లడవుతాయి. కానీ ప్రైవేటు ఆస్పత్రులవైపు జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులు వెళ్లడంలేదు. పైగా ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన వైద్యులే అత్యధికంగా ప్రైవేటు ఆసుపత్రుల్లో ఉంటూ.. సొంత క్లినిక్‌లు నడుపుతున్నారు. వీరిజోలికి వెళ్లే ధైర్యం ఉన్నతాధికారులు కూడా చేయట్లేదు. ఇప్పటికైనా కలెక్టర్ జిల్లాలో జరుగుతున్న సిజేరియన్లు.. వాటి స్థితిగతులపై సమీక్ష నిర్వహించి.. ప్రైవేటు ఆసుపత్రుల్లో జరుగుతున్న 'సి-సెక్షన్' ర్యాండమ్‌గానైనా ప్రత్యేక బృందంతో పరిశీలన చేస్తే అనవసరపు కడుపుకోతలకు అడ్డుకట్ట పడుతుందని ప్రజలు భావిస్తున్నారు.

హెపటైటిస్‌పై అప్రమత్తం

(ఐదో పేజీ తరువాయి)

వాడడం వల్ల ఈ వ్యాధి వ్యాప్తి చెందుతోంది. ఈ వైరస్ సోకిన రెండు నుంచి ఆరు వారాల్లో వ్యాధి బయట పడుతోంది. మూత్రం పచ్చగా రావడం, కడుపు నొప్పి, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ వ్యాధికి వ్యాక్సిన్ కూడా అందుబాటులో ఉంది.

● **హెపటైటిస్-డి:** దీనివల్ల లివర్ చెడిపోతుంది. కేన్సర్‌కు కూడా దారి తీస్తోంది. హెపటైటిస్-బి వ్యాపించే అన్ని మార్గాల్లో ఇది కూడా వ్యాపిస్తోంది. డ్రగ్స్ వాడే వారిలో ఇది ఎక్కువగా కనిపిస్తోంది. దీన్ని నివారించే మందులు అందుబాటులో ఉన్నాయి.

● **హెపటైటిస్-ఈ:** కలుషిత నీరు, ఆహారం వల్ల ఈ వైరస్ సోకుతుంది. సాధారణంగా నాలుగు నుంచి ఆరు వారాల్లో ఇది తగ్గుతుంది. కొందరిలో లివర్ పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉంది. రక్తం మార్పిడి, గర్భవతికి ఇన్ఫెక్షన్ ఉంటే బిడ్డకు కూడా సోకే అవకాశం ఉంది. దీనికి ఆసుపత్రిలో ఉండి చికిత్స చేయించుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

పుట్టింది సామర్లకోట.. సిక్కోలు కళలకోట!

● బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు
● ముళ్లపూడి సలహాతో సినిమాల్లోకి..
● ప్రేమించు చూడు సినిమాతో మంచిపేరు
● భార్య రాధాకుమారితో వెండితెరపై నటన
● నేడు సినీనటుడు రావి కొండలరావు వర్ధంతి



ఆయన రచయితగా కూడా రాణించారు. పాత్రికేయుడిగా, అసిస్టెంట్ డైరెక్టర్‌గా, రంగస్థల నటుడిగా ఎంతో గుర్తింపు తెచ్చుకున్న ఈయన 2020 జూలై 28న మరణించారు.

ఎచ్చెర్ల, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఆయనో బహుముఖ ప్రజ్ఞాశాలి. నటుడిగా.. రచయితగా.. డైరెక్టర్‌గా.. పాత్రికేయుడిగా అన్నిరంగాల్లోనూ ఎంతో గుర్తింపు పొందారు. తూర్పుగోదావరి జిల్లా సామర్లకోటలో జన్మించినా.. కళలకోటగా సిక్కోలుతో ఆయన అనుబంధం ప్రత్యేకం. ఇదీ రచయిత, సినీనటుడు రావి కొండలరావు ప్రస్థానం. సోమవారం ఆయన వర్ధంతి సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం. రావికొండలరావు సామర్లకోటలో జన్మించారు. ఆయన తండ్రి పోస్టుమాస్టర్. కొండలరావుకు ఐదేళ్ల వయసులో బదిలీపై శ్రీకాకుళం వచ్చేశారు. కొండలరావు విద్యాభ్యాసం స్కూల్ ఫైనల్(11వ తరగతి) వరకు సిక్కోలులోనే సాగింది. చిన్నప్పటి నుంచీ నాటకాలు, సినిమాలంటే ఇష్టం. విద్యాభ్యాసం పూర్తయిన వెంటనే సినిమాలపై మక్కువతో మద్రాస్ వెళ్లారు. సుమారు 600 సినిమాల్లో నటించిన

శోభ చిత్రంతో వెండితెరపైకి..

అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉన్న రావి కొండలరావు ముళ్లపూడి వెంకట రమణ సలహాతో సినిమాల్లో నటించడం ప్రారంభించారు. ఇలా తొలి సారిగా శోభ చిత్రం (1956) లో వెండి తెరపై మెరిశారు. ఆ తర్వాత ఆడపెత్తనం, భాగ్యదేవత, దాగుడుమూతలు, ప్రేమించి చూడు తదితర సినిమాల్లో నటించారు. అయితే ప్రేమించు చూడులో అక్కినేని నాగేశ్వర రావుకు తండ్రి పాత్రలో కొండలరావు నటించి తనకంటూ ఓ ఇమేజ్‌ను సాధించారు. సినిమాల్లో నటిస్తూనే విజయ స్టూడియో నిర్వహణ బాధ్యతలను కూడా చూశారు. తన ప్రస్థానాన్ని తెలియజేస్తూ.. 'నాగావళి నుంచి మంజీర వరకు' అనే పుస్తకాన్ని రాశారు. రామినీడు దర్శకత్వంలో బంగారు సంకెళ్లలో నటించి గుర్తింపు పొందారు. ఎన్టీఆర్ సొంత సినిమాల్లో వరుసగా 8 సినిమాల్లో నటించారు. చందమామ పబ్లికేషన్స్ ప్రారంభించిన విజయచిత్ర మాసపత్రికలో ఏకంగా 26 ఏళ్లు పనిచేశారు. ఈ పత్రిక కోసం అప్పటి పెద్ద నటులతో ఇంటర్వ్యూలు చేసి ప్రచురించేవారు. ఇలా సినీ జర్నలిస్ట్‌గా కూడా ఘనతికెక్కారు రావి కొండలరావు.

పదో ఏటనే రంగస్థలంపై..

శ్రీకాకుళంలో చదువుకుంటుండగానే తన 10వ ఏట రావి కొండలరావు రంగస్థలంపై నటించారు. విద్యార్థి దశలో ఓ రోజు నాటికలో నటిస్తుండగా.. ఆ ప్రదర్శనను చూడటానికి వచ్చిన కొండలరావు తండ్రి ఎవర్రా ఆ కుర్రాడు బాగా నటిస్తున్నాడు అని కితాబు ఇచ్చారు. ఆ పక్కనే కూర్చొన్న వేరొకతను ఆ కుర్రాడు ఎవరో కాదు సర్ మీవాడే అని చెప్పారట. దీంతో కట్టలు తెంచుకున్న కోపంతో ఆడ వేషంలో ఉన్న కొండలరావు తలకు ఉన్న విగ్‌ను అక్కడే పీకేసి తన తండ్రి బరబరా లాక్కొంటూ వెళ్లిపోయారని కొన్నేళ్ల కిందట ఏబీఎన్‌లోని 'ఓపెన్ హార్ట్ విత్ ఆర్కే'లో ఆనాటి సంగతిని కొండలరావు వెల్లడించారు. గురజాడ రాసిన కన్యాశుల్కం నాటకంలో వెంకటేశం పాత్రను నటించి మెప్పించారు. సినిమాల్లో నటించాలన్న కోరికతో తన 16వ ఏటనే చెన్నై (అప్పటి మద్రాసు)కు బయలుదేరారు. అక్కడ కొన్నాళ్లు ఉండి తిరిగి శ్రీకాకుళం వచ్చేసి స్కూల్ ఫైనల్ (11వ తరగతి) వరకు చదువుకున్నారు.

ఆర్ఎస్ఎస్ అభిమానిగా జైలుకు..

1948లో మహాత్మాగాంధీ హత్యోదంతంతో అప్పట్లో ఆర్ఎస్ఎస్‌ను నిషేధించారు. ఈ ఘటనతో ఆర్ఎస్ఎస్‌కు ఎలాంటి ప్రమేయం లేదని తెలిసిన తర్వాత కూడా నిషేధం ఎత్తివేయకపోవడంతో దీనికి నిరసనగా రాజమండ్రిలో ర్యాలీ తీశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రావి కొండలరావు కూడా మూడు నెలల రాజమండ్రి జైలులో ఉంచారు. ఆ సమయంలో గ్రంథాలయాన్ని బాగా వినియోగించుకున్నారు. సాహితీ విలువలు ఉన్న పుస్తకాలను ఆకళింపు చేసుకుని ఆ తర్వాత రచయితగా మారడానికి ప్రేరణగా నిలిచిందని ఆయనే స్వయంగా పలు ఇంటర్వ్యూలు స్పష్టం చేశారు.

మహోదయ పత్రికలో..

శ్రీకాకుళం నుంచి వెలువడే మహోదయ పక్షపత్రికకు రావి కొండలరావు ప్రూఫ్‌లు దిద్దడం, సినిమాలకు సమీక్షలు రాయడం చేస్తుండేవారు. ఆ అనుభవంతోనే స్కూల్ ఫైనల్ పూర్తయిన తర్వాత చెన్నై ఆనంద వాహిని వారపత్రికలో సబ్ ఎడిటర్‌గా చేరారు. శ్రీశ్రీ, ఆరుద్ర వంటి ఉద్దండులు పనిచేసిన ఈ పత్రికలో పనిచేయడం ఆయన గర్వంగా చెప్పుకునేవారు. ఈ క్రమంలోనే ముళ్లపూడి వెంకటరమణ, బాపులతో పరిచయం ఏర్పడింది. ఆనందవాహినిలో నెలకు ఇస్తామన్న రూ.100 కూడా ఇవ్వకపోవడంతో అవస్థలు పడి ఆరోగ్యం చెడి తిరిగి శ్రీకాకుళం వచ్చేశారు. ఆ తర్వాత కొండలరావు అన్నయ్య ఆర్.కామేశ్వరరావు (ఆర్కే రావు) మళయాళం సినిమాకు కాంట్రాక్ట్ కుదరడంతో తివేండ్రంలో మూడు నెలలు ఉండి ఈ సినిమాకు డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా పనిచేశారు. సుమారు ఆరేడేళ్ల పాటు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశారు.

సినిమాల్లోనూ భార్యాభర్తలుగా..

డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా, నాటకాల్లో నటిగా గుర్తింపు పొందిన విజయనగరానికి చెందిన రాధాకుమారితో రావి కొండలరావు వివాహం అయింది. వీరిద్దరూ నాటకాల్లోనే కాదు సినిమాల్లో కూడా జోడిగానే నటించి సిల్వర్ స్క్రీన్‌పై ది బెస్ట్ అనిపించుకున్నారు. నిజ జీవితంలో వలే వీరిద్దరూ చాలా సినిమాల్లో భార్యాభర్తలుగానే నటించి రికార్డు సృష్టించారు.

రచయితగా గుర్తింపు..

రావి కొండలరావు రచయితగా కూడా గుర్తింపు పొందారు. సినిమాకు కథలు కూడా రాసి పేరు సాధించారు. రాజేంద్రప్రసాద్ నటించిన బృందావనం, పెళ్లిపుస్తకం సినిమాలతోపాటు బాలకృష్ణ నటించిన జానపద చిత్రం భైరవ ద్వీపం సినిమాలకు రచయితగా ఎనలేని ఖ్యాతిని ఆర్జించారు. అప్పటి వరకు ఉన్న జానపద చిత్రాలకు భిన్నంగా భైరవ ద్వీపం కలెక్షన్ల వర్షాన్ని కురిపించారు. చందమామ కథలు, పరోపకారి పాపన్న తదితర దూరదర్శన్ సీరియల్స్‌లో కూడా నటించారు. ఈయనకు ఆంధ్రా వర్సిటీ కళాప్రపూర్ణ ఇచ్చి గౌరవించింది. ఐదున్నర దశాబ్దాలకు పైగా సంపూర్ణ నట జీవితాన్ని పొందిన కొండలరావు తాను అనుకున్న అన్ని రంగాల్లో పేరు పొందారు. ఫిబ్రవరి 11, 1932లో సామర్లకోట జన్మిచిన కొండలరావు, జూలై 28, 2020న తన 88వ ఏట సినీ లోకానికి సెలవు చెప్పి కన్నుమూశారు.

టీడీపీతోనే ఉత్తరాంధ్ర నేతలకు అత్యున్నత గౌరవం


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం, జూలై 27(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలోనే ఉత్తరాంధ్ర నేతలకు అత్యున్నత గౌరవం లభించిందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజుకు గోవా గవర్నర్‌గా పదవి వరించడం ఉత్తరాంధ్రకే గర్వకారణమన్నారు. అలాగే ఉత్తరాంధ్ర నుంచి కింజరాపు రామ్మోహన్ నాయుడికి కేంద్రమంత్రి పదవి దక్కడం, సాధారణ కార్యకర్త కలిశెట్టి అప్పలనాయుడును ఎంపీగా చేయడం తెలుగుదేశం పార్టీకే సాధ్యమన్నారు. ఉత్తరాంధ్రలో విద్యా సంస్థల స్థాపనకు, ఆలయాలకు వేల ఎకరాల భూమిని ధారాదత్తం చేసిన అశోక్‌గజపతి రాజుకు గత వైసీపీ ప్రభుత్వం మానసిక క్షోభకు గురిచేసిందని ఆరోపించారు. అలాగే మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి పదేపదే తనపై చేసిన ఆరోపణలను ఎమ్మెల్యే ఖండించారు. ఇది ఆమె దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు సైలాడ సతీష్, శివాల చిన్నయ్య, నందిగామ ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ యాత్రను జయప్రదం చేయండి


నినాదాలు చేస్తున్న సంఘ ప్రతినిధులు

నందిగాం, జూలై 27(ఆంధ్రజ్యోతి): మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం, మాలల జేఏసీ ఆధ్వర్యంలో వచ్చే నెల 3 నుంచి నిర్వహించనున్న రాజ్యాంగ పరిరక్షణ యాత్రను జయప్రదం చేయాలని మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లా రామారావు కోరారు. ఆదివారం నందిగాంలో మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగానికి విరుద్ధంగా చేపట్టిన ఎస్సీ వర్గీకరణ వలన మాలలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన సూచల్ని పట్టించుకోకుండా, సరైన జనాభా లెక్కలు లేకుండా వర్గీకరణ చేసిందని, దీంతో మాలలు అన్ని రంగాల్లో వెనుకబడే ప్రమాదం ఉందన్నారు. సుప్రీంకోర్టు చెప్పినట్లు 59 ఉపకులాల్లో ఏ కులాలు వెనుకబడి ఉన్నాయో వాటిని అభివృద్ధిలోకి తీసుకురావడానికి ప్రత్యేక సదుపాయాలు కల్పించాలే తప్ప దళితులు మధ్య విభజన వాదం సరైనది కాదన్నారు. కార్యక్రమంలో సంఘాల ప్రతినిధులు రెయ్యి రామారావు, సీహెచ్ పద్మలోచన, ఎన్.రంగారావు, వి.లోహిత్‌కుమార్, వి.ఢిల్లేశ్వరరావు, ఫాల్గుణరావు, యు.శ్రీనివాసరావు, పి.తారకేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రమణమూర్తి

పోలాకి, జూలై 27(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. ఆదివారం తన క్యాంప్ కార్యాలయంలో ప్రజల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. అర్జీదారుల సమస్యలపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కారానికి కృషిచేశారు. ప్రతీరోజు ఉదయం తన క్యాంప్ కార్యాలయంలో ప్రజా సమస్యలు తెలుసుకుంటానని అర్జీదారులు, స్థానిక నాయకులకు అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే తెలిపారు.

ఉత్తరాంధ్ర వాసులకు గర్వకారణం


మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ

హిరమండలం, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రను కొన్ని శతాబ్దాల పాటు పరిపాలించిన అశోక గజపతిరాజు కుటుంబానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గౌరవించడం హర్షనీయమని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణమూర్తి అన్నారు. ఆదివారం గులుమూరు గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అశోకగజపతిరాజుకు గోవా గవర్నర్‌గా నియమించడం ఉత్తరాంధ్రవాసులకే గర్వకారణమన్నారు. వైసీపీ హయాంలో గజపతిరాజును అన్ని విధాలుగా ఇబ్బందిపెట్టారన్నారు. జడ్పీటీసీ పి.బుచ్చిబాబు, టీడీపీ నాయకులు కె.అప్పలరాజు, ఎస్.గోవింద, తంగి అప్పన్న ఉన్నారు.

అశోక్ గజపతిరాజుకు గవర్నర్ పదవిపై హర్షం

పోలాకి, జూలై 27(ఆంధ్రజ్యోతి): అశోక్ గజపతిరాజుకు గోవా గవర్నర్ పదవి రావడం ఉత్తరాంధ్ర జిల్లాలకు ఎంతో గర్వకారణమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. ఆదివారం ఆయన తన క్యాంప్ కార్యాలయంలో మాట్లాడుతూ.. ఉత్తరాంధ్రను అభివృద్ధి చేయడమే కాదు.. అక్కడి నాయకులను ప్రోత్సహించడంలో కూటమి ప్రభుత్వం ముందుందని మరోసారి రుజువైందన్నారు. అశోక్ గజపతిరాజు కుటుంబం ఉత్తరాంధ్రలో విద్యాసంస్థల స్థాపనకు, ఆలయాలకు వేలాది ఎకరాల భూమిని వితరణగా ఇచ్చిన తన ఉదారతచాటుకోవడం విశేషమన్నారు. అటువంటి కుటుంబానికి చెందిన వ్యక్తిని గత వైసీపీ ప్రభుత్వం మానసికంగా ఒత్తిడికి గురిచేసిందని, అక్రమ కేసులు బనాయించి వేధించిందని గుర్తుచేశారు. విశాఖలో ఐటీ సెజ్, ఎన్టీపీసీ గ్రీన్, భోగాపురం విమానాశ్రయం, విశాఖ రైల్వేజోన్ ఒక్క ఏడాదిలోని సాధించిన ఘనత సీఎం చంద్రబాబుకు దక్కుతుందనడంలో సందేహంలేదన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రాంబాబు, పార్టీ ఇన్‌చార్జి బగ్గు అర్చన, తదితరులు ఉన్నారు.

టీడీపీతోనే సంక్షేమ పాలన

పలాస, జూలై 27(ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే సంక్షేమ పాలన సాధ్యమని టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గాలి కృష్ణారావు అన్నారు. ఆదివారం 30వ వార్డులో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా కార్యకర్తలు, నాయకులతో కలసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఏడాదిలోనే అమలు చేశారని, ఆగస్టు నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కూడా కల్పిస్తున్నట్టు తెలిపారు. నాయకులు కె.సురేష్, మనోజ్, శ్రీను, తిరుపతి, గంగాధర్ ఉన్నారు.

జగన్ మోసాలపై నిలదీయండి

నందిగాం, జూలై 27(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి పాలనలో ఎస్సీ, ఎస్టీలకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఆయన మోసాలపై దళిత ఆదివాసీలు ఆ పార్టీ నాయకుల్ని నిలదీయాలని టెక్కలి నియోజకవర్గ దళిత సంఘ ప్రతినిధి చింతాడ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ.. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ నిధుల్ని పక్కదారి పట్టించి ఒక్క రూపాయి కూడా రుణం ఇచ్చిన దాఖలాలు లేవన్నారు.

ఘనంగా కవి సమ్మేళనం

కొత్తూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): కష్టజీవికి ఇరువైపుల ఉండేవారు కవి అని, రెక్కలు ముక్కలు చేసుకుని కూలీ, నాలీ చేసుకుంటూ జీవనోపాధిని పొందుతూ బతుకీడ్చుతున్న శ్రామిక కార్మిక, కర్షక వర్గాలను ఆదుకోవాలంటూ రచయితలంతా తపించాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పారిశెల్లి రామరాజు పిలుపునిచ్చారు. కొత్తూరు రచయితల వేదిక ఆధ్వర్యంలో స్థానిక ఓ ప్రైవేట్ పాఠశాల ఆవరణలో ఆదివారం జరిగిన కవి సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇటీవల నిర్వహించిన తెలుగు బాషా ప్రతిభా పోటీల్లో విజేతగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను, ప్రోత్సాహకాలను అందజేశారు. ఉపాధ్యాయులు రమణమూర్తి, దీలీప్ రాజీ పట్నాయక్, శ్రీరాములు, ఉషారాణి పాల్గొన్నారు.

నెరవేర్చలేని హామీలతో మోసం

ఎల్ఎన్ పేట, జూలై 27(ఆంధ్రజ్యోతి): అధికారమే లక్ష్యంగా చేసుకొని ఎన్నికల ముందు కూటమి నాయకులు నెరవేర్చలేని హామీలిచ్చి అధికారంలోకి ప్రజలను మోసం చేశారని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆరోపించారు. తురకపేట గ్రామంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడా రు. కార్యక్రమంలో ఎంపీపీ జ్యోతిలక్ష్మి, నాయకులు పి.విష్ణు, ఆర్.రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు!

● పలాస-కాశీబుగ్గలో రైతు బజారు ఏర్పాటుకు సన్నాహాలు
● మూడు రోడ్ల జంక్షన్‌లో స్థల పరిశీలన



రైతుబజారు ఏర్పాటుకు గుర్తించిన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

కాశీబుగ్గ, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలకు రైతుబజారు కల సాకారమైంది. దశాబ్దాలుగా ఇక్కడ రైతుబజారు ఏర్పాటుచేయాలని జంట పట్టణాలతో పాటు నియోజకవర్గ ప్రజలు కోరుతూ వచ్చారు. గత వైసీపీ ప్రభుత్వం మాత్రం హామీలతో కాలం వెల్లబుచ్చింది. ఇప్పుడు స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష చొరవతో రైతుబజారు ఏర్పాటుకానుంది. కాశీబుగ్గ మూడు రోడ్ల జంక్షన్‌లోని ఎంపీయూపీ పాఠశాలలో రైతుబజారు ఏర్పాటుకు మార్కెటింగ్ శాఖ నిర్ణయించింది. దీంతో ఆదివారం ఆ ప్రాంగణాన్ని ఎమ్మెల్యే శిరీష పరిశీలించారు. వీలైనంత త్వరగా అక్కడ రైతుబజారు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేస్తున్నారు. దీంతో జంట పట్టణాల్లో ట్రాఫిక్ సమస్య తీరుతుంది. మరోవైపు రైతుల వ్యవసాయ ఉత్పత్తుల క్రయ విక్రయాలకు ఎంతో దోహదపడనుంది. పట్టణవాసులకు తాజా కూరగాయలు అందుబాటులోకి రానున్నాయి.

ప్రకటనలతో గడిపేసిన వైసీపీ..

వైసీపీ హయాంలో ఆర్భాటపు ప్రకటనలే మిగిలాయే తప్ప రైతుబజారు హామీ మాత్రం కార్యరూపం దాల్చలేదు. 2019 ఆగస్టు 8న అప్పటి ముఖ్యమంత్రి జగన్ అసెంబ్లీ సాక్షిగా రాష్ట్ర వ్యాప్తంగా 100 రైతు బజార్లు ఏర్పాటు చేస్తున్నామని.. ఆ జాబితాలో పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలకు చోటిస్తూ స్వయంగా సభలో వెల్లడించారు. ఇందుకుగాను రూ.50 లక్షలు కేటాయిస్తున్నట్టు చెప్పుకొచ్చారు. వెంటనే అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్న సీదిరి అప్పలరాజు త్వరలో పనులు ప్రారంభిస్తామని.. స్థల పరిశీలన, టెండర్ల ప్రక్రియ సైతం పూర్తయ్యిందని ప్రకటించారు. కానీ గత ఐదేళ్లలో అదిగో ఇదిగో అన్నారే తప్ప రైతుబజారు ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు.

టీడీపీ హయాంలో తొలిఅడుగు

టీడీపీ ప్రభుత్వ హయాంలో రైతుబజారు నిర్మాణానికి అడుగులు పడ్డాయి. టెలిఫోన్ ఎక్స్ఛేంజీ సమీపంలో స్థలాన్ని 2018లో అధికారులు గుర్తించారు. అక్కడ పనులు ప్రారంభించేందుకు టెండర్లు కూడా పూర్తి చేశారు. పనులు ప్రారంభమయ్యాయి. ప్రాథమిక దశను దాటుతున్నాయి. ఈ తరుణంలో ఈ స్థలం మాది అంటూ కొందరు కోర్టును ఆశ్రయించారు. దీంతో పనులు నిలిచిపోయాయి. ఇంతలో ఎన్నికలు రావడం, అధికార మార్పిడి జరిగిపోయింది. 25 శాతంలోపు ఉన్న పనులను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది. అయితే జంట పట్టణాల్లో రైతుబజారుకు అనువైన ప్రాంతాలు ఉన్నా వైసీపీ ప్రభుత్వం గుర్తించడంలో విఫలమైంది. జంట పట్ట ణాల్లో రైతుబజారు లేకపోవడంతో పాతబస్టాండ్ ప్రాంగణంలో కూరగాయల విక్రయాలు జరుగుతున్నాయి. ఒక వైపు మైదానం, మరోవైపు ఉద్దానం, ఇంకోవైపు తీర ప్రాంతం ఉండడంతో రైతులు వ్యవసాయ ఉత్పత్తులు, మత్స్యకారులు చేపలు తెచ్చి విక్రయిస్తుంటారు. అటు గిరిజనులు సైతం అటవీ ఉత్పత్తులు అమ్ముతుంటారు. వీరికి సరైన మార్కెట్ లేకపోవడంతో దళారుల బారిన పడుతున్నారు. మరోవైపు జంట పట్టణాల్లో రహదారులపై షాపులు వెలుస్తుండడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. పాత బస్టాండ్ ప్రాంగణంలో అయితే కూరగాయల దుకాణాలతో వాహనాలు కూడా నిలుపుకునే దుస్థితి లేదు. రైతుల నుంచి వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్న దళారులు అధిక ధరకు విక్రయిస్తున్నారు. అటు పట్టణవాసులకు తాజా కూరగాయలు దొరకని పరిస్థితి. ఈ నేపథ్యంలో అందరికీ ఆమోదయోగ్యమైన మూడు రోడ్ల జంక్షన్‌లో రైతుబజారు ఏర్పాటవుతుండడంపై జంట పట్టణవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిశీలనలో ఏఎంసీ చైర్మన్ వజ్జ బాబురావు, తహసీల్దార్ కల్యాణ్ చక్రవర్తి, నాయకులు పీరుకట్ల విఠల్‌రావు, గాలి కృష్ణారావు, బడ్డ నాగరాజు, శ్రీనివాస్‌రావు, సప్ప నవీన్‌కుమార్, చంద్రశేఖర్‌త్యాడి, సూర్యనారాయణ, సవర రాంబాబు, డల్లి నర్సింగులు, కొండే నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.